క్లుప్తంగా

వైభవంగా ముగిసిన మహా కుంభాభిషేకం



తాళ్లపూడిలో యాగశాలలో శత చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవాలు, శత చండీయాగం బుధవారంతో వైభవంగా ముగిసాయి. మూడు రోజులుగా సిద్ధేశ్వర శ్రీ కార్తికేయ శివాచార్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అల్లూరి ప్రసాద్ పర్యవేక్షణలో వేద పండితులు యాగశాలలలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, మహా పూర్ణాహుతి, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, దుర్గామల్లేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహా అన్న సమారాధనలో 4 వేల మందికి పైగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అత్త, అల్లుడికి గాయాలు



కొవ్వూరు రోడ్డు ప్రమాదంలో గాయపడిన దుర్గారావు

కొవ్వూరు: మోటారుసైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురు గాయాల పాలయ్యారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంకు చెందిన గురు దుర్గారావు, అతని అత్త కోనే సత్యవతిని తీసుకుని మోటారుసైకిల్‌పై రాజమహేంద్రవరం ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో రోడ్డు కంరైలు వంతెన సమీపంలో ఉన్న పెట్రోలు బంక్ వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు.ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రగాయాల పాలయ్యారు.108 అంబులెన్స్‌లో ఇరువురినీ కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

అయ్యప్ప పీఠంలో పూజలు, అభిషేకాలు



తాళ్లపూడిలోని అయ్యప్ప పీఠం వద్ద పూజలు చేస్తున్న మాలధారులు

తాళ్లపూడి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వెనుక గల ఆర్యవైశ్య సత్రంలో శ్రీధర్మశాస్త అయ్యప్ప పీఠంలో 13 రోజులుగా 200 మాలధారులు నిత్య పూజలు చేస్తున్నారు. బుధవారం స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఉదయం పూజ, పడి, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం పూజ, పడి ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా పీఠం ఏర్పాటు చేసిన నందిని బేకరి ప్రసాద్, చిన్నా మిత్ర బృందాన్ని పలువురు అభినందిస్తున్నారు.

కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలి

నల్లజర్ల: నవంబరు నెల కోటా ద్వారా లబ్ధిదారులందరికీ బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు సరఫరా చేయాలని ఏఎస్‌ఓ రామాంజనేయులు డీలర్లకు సూచించారు. బుధవారం నల్లజర్ల తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి డీలరు విడివిడిగా డీడీలు తీసుకొని సరుకులు దిగుమతి తీసుకోవాలన్నారు. ప్రతి నెల 1వతేదీ ఉదయం 6 గంటలకే ప్రజలకు సరుకులు అందించాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ, డీలర్ల సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కడియం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లో పాల్గొని ఆల్‌రౌండ్ ప్రతిభను కనపర్చాలని హెచ్‌ఎం టి.సత్యనారాయణ అన్నారు. ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఇళ్ల నవీన్ కుమార్ చెన్నైలో జరిగిన జాతీయ కరాటే అండర్ 15 విభాగంలో పాల్గొని తృతీయ స్థానం సాధించాడు. అలాగే అంకం శ్రావణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అలాగే జిల్లా స్థాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీల్లో వంగ హారిక రాజరాజేశ్వరి ద్వితీయ స్థానం సాధించింది. ఈ ముగ్గురు విద్యార్థులను బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. వారికి శిక్షణనిచ్చిన పీడీలు ఎం.డేవిడ్, వీరబాబులను, గొల్లపల్లి సత్యనారాయణ, జానకిరామ్‌లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో బి. సువర్ణవేణి, రఫీయుద్దీన్, సతీష్, శరత్ బాబులు పాల్గొన్నారు.



పెరవలిలో నివాసాల వద్ద చెత్తచెదారం



మల్లేశ్వరం వద్ద జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త



పెరవలిలో మూతపడిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం



పిట్టల వేమవరంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

- సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవు

పెరవలి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చు. గ్రామ స్థాయిలో సంపూర్ణ పారిశుధ్యం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు కేటాయించింది. దీంతో పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలు నెలకొల్పారు. ఈ పథకం ద్వారా ఉభయతారకంగా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి అటు పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు, రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించవచ్చు. ప్రజలకు కూడా ప్రకృతి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు అందించవచ్చవచ్చని భావించారు. కానీ అధికారుల కార్యాచరణ సక్రమంగా లేకపోవటంతో లక్ష్యం నీరుగారిపోయింది. పారిశుధ్య నిర్వహణ కోసం కార్మికులతో పాటు అందుకు అవసరమైన చెత్తా చెదారాలను పోగుచేయటానికి వాటి నుంచి సంపద సృష్టించటానికి కావలసిన మౌలిక సదుపాయాలున్నా ఫలితం ఆశించినంతగా రాలేదు.

దుర్వాసనతో ఇబ్బందులు

నెల రోజులుగా గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వదలివేయటంతో వర్షాలకు తడిసి తీవ్ర దుర్గంధం రావటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో రోడ్లపై చెత్తా చెదారం చేరి ప్రయాణికులు, బాటసారులు, గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగల విజృంభించడంతో వ్యాధులు వ్యాపించి ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. చాలామంది రోగాల బారిన పడి తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రుల్లో చేరి ఆర్థికంగా నష్టపోతున్నారు.



అజ్జరంలో రోడ్డుపైనే పేరుకుపోయిన చెత్తచెదారం

సంపద కేంద్రాలకు, ట్రై సైకిళ్లు, ఆటోలు

పెరవలి మండలంలో 18 గ్రామాల్లో 18 సంపద కేంద్రాలకు షెడ్లు నిర్మించారు. వీటికి గ్రామస్థాయి ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించిన 18 షెడ్లకు రూ.1.17 కోట్లు ఖర్చు చేశారు. ట్రై సైకిళ్లు ఒక్కొక్కటి రూ.31,400 చొప్పున 45 ట్రై సైకిళ్లు పంపిణీ చేయగా మరో 24 సిద్ధంగా ఉన్నాయి. వీటి విలువ రూ.22.66 లక్షలు, 24 ఆటోలకు రూ.24 లక్షలు, డస్ట్‌బిన్లు 588 పంపిణీ చేయగా వీటి విలువ రూ.3.58 లక్షలు. పారిశుధ్యం నిర్వహణ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు ఖర్చు చేసింది. ఇంత చేసినా ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగంలోకి తీసుకురాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అరకొరగా ఆదాయం

పెరవలి మండలంలో 18 గ్రామాల నుంచి ఈ సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఇప్పటి వరకు కేవలం రూ.24 వేల ఆదాయం మాత్రమే వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో శాఖకు ఒక అధికారిని అదనంగా నియమించటంతో ఉద్యోగుల సంఖ్య గ్రామస్థాయిలో బాగా పెరిగింది. పంచాయతీలకు వివిధ శాఖల పనుల ప్రమేయం తగ్గించారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టవలసిన కార్యదర్శులు నిర్లక్ష్యం చేయటంతో ఆర్థిక పరిపుష్టి సాధించలేకపోతున్నాయి.

కాలువ గట్ల పక్కనే చెత్త డంపింగ్



గ్రామాల్లో చెత్తా చెదారం ఎక్కడిక్కడ పేరుకుపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. ఇళ్ల దగ్గర చెత్తను సేకరించరు. ఒకవేళ సేకరించినా రోడ్లు లేక కాలువ గట్ల పక్కన వేస్తున్నారు. దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంపద కేంద్రాలున్నా చెత్త అక్కడ వేయడం లేదు.

– భట్టు మోహన్, ఉసులుమర్రు

వర్షాల వల్ల ఆటంకం



సంపద కేంద్రాల వద్ద ఎరువులు తయారు చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాల వల్ల ఎరువు తయారు చేయటానికి షెడ్ల దగ్గరకు చెత్తను తీసుకువెళ్లడానికి ఇబ్బందులు ఉన్నాయి. వర్షాలు తగ్గిన తరువాత అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి ఎరువు తయారీపై దృష్టి సారిస్తాం.

– సీహెచ్ వెంకటరమణ, ఈఓపీఆర్డీ అండ్ ఇన్‌చార్జి ఎంపీడీఓ పెరవలి

పోలీసు విధులపై అవగాహనకు విద్యార్థులకు ఓపెన్ హౌస్



కొవ్వూరులో వివిధ ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: పోలీసు విధులు, బాధ్యతలపై పట్టణ సీఐ పి.విశ్వం విద్యార్థులకు అవగాహన కల్పించారు.బుధవారం పట్టణంలోని అభ్యాస స్కూల్లో నిర్వహించిన పోలీసు సంస్మరణ వారోత్స వాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పి.రఘురామ్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నిడదవోలు : నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కోర్టులో రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జి. రామకృష్ణ కోరారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించడానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆధార్ కేంద్రాలు

నిడదవోలు రూరల్: ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. సమిశ్రగూడెంలో సచివాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ పి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ రేషన్ సరుకుల పంపిణీ చేయాలి



దేవరపల్లిలో మాట్లాడుతున్న డివిజినల్ సహాయ సరఫరా అధికారి రామాంజనేయులు

దేవరపల్లి: కార్డుదారులందరికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కొవ్వూరు డివిజినల్ సహాయ సరఫరా అధికారి రామాంజనేయులు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నెలలకు నూరు శాతం కందిపప్పు, పంచదార ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రతి కార్డుకు కిలో కందిపప్పు రూ. 67, అర కిలో పంచదార రూ. 17 చొప్పున పంపిణీ చేయాలన్నారు. దేవరపల్లి మండలానికి సుమారు 26 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి నెల 12వ తేదీ నాటికి రేషన్ పంపిణీ పూర్తి చేయాలని, రోజుకు 150 కార్డులకు పైబడి రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయంతో పని చేసి రేషన్ పంపిణీలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉంచాలన్నారు. ప్రస్తుతం ద్వితీయస్థానంలో ఉన్నట్టు ఆయన చెప్పారు. అన్ని సరుకులు ఒకటో తేదీ నాటికి రేషన్ దుకాణాల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. మండల స్థాయి గిడ్డంగిలో తూకాలు వేసి సరుకులు ఇవ్వాలని, తరుగు ఎక్కువగా ఉంటోందని రేషన్ డీలర్లు ఏఎస్‌ఓ రామాంజనేయులును కోరారు. ఈ కార్యక్రమంలో మండల సరఫరా అధికారి ఎం.సత్యనారాయణ, మండల డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, ఎండీయూ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఏఎస్‌ఓ రామాంజనేయులును ఘనంగా సత్కరించారు.

ధాన్యం కొనుగోలుకు త్వరితగతిన జమ



ధర్మవరంలో ధాన్యం కొనుగోలు అనంతరం రైతుకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జేసీ చిన్నరాముడు

కొవ్వూరు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేస్తామని జేసీ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. కొవ్వూరు మండలం ధర్మవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం సాయంత్రం పరిశీలించారు. గ్రామానికి చెందిన పోలిశెట్టి శేషయ్య నుంచి ఏ గ్రేడు రకం ధాన్యం అక్టోబర్ 21న ఆరవై మెట్రిక్ టన్నులు, 22న మరో రైతు నుంచి 32.4 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు. వీటికి సంబంధించి రైతు శేషయ్యకి రూ.2,14,368, పి.రమేష్‌కు రూ.86,368 బుధవారం జమ చేసినట్లు ప్రకటించారు. ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు కార్మిక సంఘాల నేతల ఘన నివాళి

దేవరపల్లి: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతిపట్ల దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాంతంలోని పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం దేవరపల్లి మండలం దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జీఎన్ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ సాయిబాబా ఆదివాసులు, దళిత, పీడిత వర్గాల పక్షాన పోరాటం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూల సమితి జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్ రాజ్, వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచంట వరప్రసాద్, ఏడుకొండలు, హుస్సే ప్రసాద్, సుబ్రహమణ్యం, అనిల్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా వైఎస్సార్ సీపీ

మాజీ హోంమంత్రి తానేటి వనిత



అనంతపల్లిలో పెద్దింట్లు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: ప్రతి కార్యకర్త, నాయకులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం ఆమె నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల అనంతరం జరిగిన వివిధ సంఘటనల్లో బాధితులైన కుటుంబాలకు పార్టీ అందజేసిన సాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మూడు కుటుంబాలకు రూ.3.50 లక్షల చెక్కులను ఆమె అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొత్తగూడెంకు చెందిన సోషల్‌మీడియా కన్వీనర్ కనికెళ్ల విల్సన్ కుటుంబ సభ్యులకు పార్టీ మంజూరు చేసిన రూ.2లక్షల చెక్కును ఆయన భార్య వెంకటదుర్గకు అందించారు. టీడీపీ విజయోత్సవ ర్యాలీలో ఆపార్టీ కార్యకర్తలు పుల్లలపాడు వైఎస్సార్ సీపీ కార్యకర్త బెడిపెల బాబ్జీ బైక్‌ను ధ్వంసం చేశారు. బాధితుడు బాబ్జీకి రూ.50వేల చెక్కును వనిత అందజేశారు. వైఎస్సార్ సీపీ ఓటమితో అనంతపల్లిలో టీడీపీ మహిళా నేతల వేధింపులకు గురై మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన డ్వాక్రా మహిళ మండల పెద్దింట్లు కుటుంబానికి రూ.లక్ష చెక్కును వనిత అందజేశారు. ఆమెతో పాటు మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు కారుమంచి రమేష్, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, ఎంపీటీసీ యడ్లపల్లి మూర్త, మహిళా నాయకురాలు యజ్ఞవరపు లక్ష్మీగాంధీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థినులు

చాగల్లు: అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు తెలిపారు.ఈ నెల 25 నుంచి 27 వరకు అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన కె.పావని, ఎం మోహిని, ఆర్ ప్రవల్లిక, జె.జోస్నవి పాల్గొంటారని తెలిపారు. వీరు పల్లంట్లలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఈ విద్యార్థినులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుధాకర్‌ను పలువురు అభినందించారు.



చాగల్లులో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అహరోన్

నిడదవోలు : స్థానిక డొక్కా సీతమ్మ ఓరియంటల్ మున్సిపల్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి కాకి అహరోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దెందులూరు మండలం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఈనెల 22న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాకి అహరోన్ 600, 400 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచాడు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అహరోన్ జిల్లా తరుపున పాల్గొంటాడని హెచ్‌ఎం నేతల భీమారావు, పీఈటీ మూతిన వీరలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం కాకి అహరోన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



కాకి అహరోన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

డీసీఎంఎస్‌లో బాణసంచా విక్రయాలు

నిడదవోలు రూరల్: రైతులకు, వినియోగదారులకు డీసీఎంఎస్ ద్వారా తక్కువ ధరలకే బాణసంచా సామగ్రిని విక్రయిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వీఎస్ కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ దీపావళి బాణసంచా సామగ్రి దుకాణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ సమిశ్రగూడెం, ఏలూరు, భీమవరంలో రూ.2 కోట్ల విలువచేసే బాణసంచా సామగ్రిని విక్రయించేందుకు ఈ ఏడాది చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఏలూరు. నిడదవోలు, భీమవరంలో జనరిక్ మందులను 80 శాతం రాయితీతో విక్రయిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు డీసీఎంఎస్ మేనేజర్ పి.శ్రీనివాస్‌రాజు, రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ బి.అప్పారావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో బాణసంచా విక్రయాలను ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ జిల్లా బీఎం

మహిళల అక్రమ రవాణాను అడ్డుకోవాలి



అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రావ్యశృతి

నల్లజర్ల: మహిళల భద్రత, కిశోర బాలికల అక్రమ రవాణా నిరోధించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాదుకు చెందిన ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్యశృతి అన్నారు. నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావ్యశృతి మాట్లాడుతూ ప్రతి నిత్యం ఎంతో మంది మహిళలు, కిశోర బాలికలు వేధింపులకు, అపహరణకు గురువుతున్నారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని మహిళలకు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నిరోధానికి 28 ఏళ్లుగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ, విద్య, పోలీస్, న్యాయశాఖల ఆధ్వర్యంలో 28,200 మందిని కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. సీడీపీఓ నాటలక్ష్మి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఏసీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన యువతులను ఉద్యోగం, సినిమా, సీరియల్స్‌లో అవకాశాలు కల్పిస్తామని డబ్బు ఆశ చూపి, మభ్యపెట్టి వ్యభిచార గృహాలకు విక్రయిస్తున్నట్టు వివరించారు. ఇటువంటి సందర్భాల్లో 1930 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. ఈ శిక్షణలో పలు అంశాలను లఘు చిత్రాల ద్వారా వివరించారు. సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

నల్లజర్ల: తెలికిచెర్ల శివార్లో పొలాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 16 మందిపై కేసు నమోదు చేశారు. ఐదు కోడి పుంజులు, 3 కోడికత్తులు, రూ.9,400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపారు.

కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్

- అదనపు బాధ్యతల స్వీకరణకు కార్యదర్శుల విముఖత
- సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు

పెరవలి: జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతర్ చేయటంతో పెరవలి మండలంలోని కొందరు పంచాయతీ కార్యదర్శుల తీరుపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే పెరవలి మండలంలో 18 పంచాయతీలకు ముగ్గురు గ్రేడ్ 2 కార్యదర్శులు, ఏడుగురు గ్రేడ్ 5 కార్యదర్శులు ఉన్నారు. 8 పంచాయతీలకు కార్యదర్శులు లేకపోవటంతో ఏడుగురికి అదనపు బాధ్యతలు, పంచాయతీలు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీనితో గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు విముఖత వ్యక్తం చేస్తూ అదనపు పంచాయతీల బాధ్యతలు తీసుకోకుండా ఉత్తర్వులను బేఖాతర్ చేయటంతో పాటు విధులకు హాజరు కాలేదు. దీనిపై మండల ఈఓపీఆర్డీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వటంతో కలెక్టర్ ఆగ్రహించి వెంటనే అదనపు పంచాయతీల బాధ్యతులు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన వారిని సస్పెండ్ చేయాలి ఆదేశించారు. దీంతో హుటాహుటిన కార్యదర్శులు వారికి కేటాయించిన అదనపు పంచాయతీల చార్జీ తీసుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు వారు నివేదించడంతో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని వారు ఆదేశించారు. దీనిపై గ్రేడ్ 5 కార్యదర్శులు లేఖలు రాసి ఇచ్చారు. ఈ విషయంపై ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారి వద్ద పంచాయతీ నడుస్తోంది.ఈ విషయంపై కలెక్టర్ ఎలా స్పందిస్తారోనన్న ఆందోళనలో కార్యదర్శులు ఉన్నారు.